"యీడిజిమ్మడా" అంది యీరమ్మ.

"కూకుంటే సెక్రంకాడ కూకుంటాం. లేకబోతే బీడీ దుమ్ము పీకుతా కాళ్లు బార్జాపి పండుకోటం తప్ప యీడేయిదంగా మనగాడంటా?" అన్నాడు ఎంకన్న.

అట్టనమోకయ్యోవ్ యియాల కారు గొప్ప నీకూ నాకూ తెలవకబోతే యిరగబడి సూత్తుండ వూరి జనం గురించి ఏమనుకోవాలా. యింత తిండికి నీకాకరువు, ఆరుయింత పెట్టినన్నాళ్ళు అదే మనకు పదేలు" అంది యీరమ్మ.

"కారు దుమ్ము దులపటం, మస్తానయ్యకు బీడీలు కొనుక్కురాటం – అదీ ఒక పనంటే? ఎంకన్న దద్దమ్మని రేపనరంటే నన్నూ" అన్నాడు ఎంకన్న.

ఎంకన్న యీపుమీద సల్లగా రుద్దుతా "తోటపని సేసుకుంటే మనని ఎవురేం అనరు" అంది యీరమ్మ.

నరసిమ్మారావుగోరి మామిడితోటలో పెద్దబావికి మోటారుయింజిని తగిలిత్తారని వూరంతా మోగిపోయింది.

మామిడితోట పెద్దబావికాడ అగుపించాదు గోసాయి. సెంద్రం సిటారు కొమ్మన కనపడకుండా దాంకుని మిగిలిపోయిన మామిడిపండు కోసిస్తే సెంద్రం గోసాయిని యీమద్దె కారు బూర తాకనిచ్చాదు.

"ఏం అబ్బాయిగోరూ?" అని పలకరిచ్చాదు గోసాయి సెంద్రాన్ని.

"మా బావికి మోటారు పెద్తున్నార్రా గోసాయ్" అన్నాడు సెంద్రం నవుతా.

"బాయికి మోటారు తగిలిత్తారా? అదేందండి అబ్బాయిగోరూ?" అన్నాడు గోసాయి.

"మోటారంటే మనుషులెక్కే మోటారు కాదురా, నీళ్లు తోడే మోటారు. యింక మా మేడమీదకు నీళ్లొస్తాయి పంపులు పెట్టంగానే" అన్నాడు సెంద్రం.

"మెటారు నీలు తోడుద్దా!" అన్నాడు గోసాయి నోరు దెరిసి.

"నీ మొహం నీకేం తెలియదు. గొట్టాలు బావిలోకి దింపి మోటారు యింజను ఒక్క నిమిషం ఆడిస్తే ఏనుగు తొండమంత ధారపడి కాసేపట్లో యీతోటంతా తడిసిపోతుంది" అన్నాడు సెంద్రం.

"ఆఁ! మరి మా అయ్య అమ్మోళ్లు ఎన్ని నీలయినా ఏతాం ఎత్తుతారుగా" అన్నాడు గోసాయి.

"యింక ఏతాం ఎత్తక్కర్లేదు. మనిషి తోడకుండానే ఎన్నయినా నీళ్లొస్తాయి మాకు" అన్నాడు సెంద్రం.

